సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లల పాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంత నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబాను దర్శించుకుని,విభూది,పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. తొలుత గణపతి హోమం నిర్వహించారు. ఏటా జనవరి నెలలో వార్షికోత్సవ పూజలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు.నేటి నుంచి గురువారం వరకు ఆలయ మహోత్సవాలు జరుగుతాయని చెప్పారు.

మర్యాదపూర్వక కలయిక



షిప్‌యార్డు జీఎం అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

మల్కాపురం: నూతన సంవత్సరం సందర్భంగా షిప్‌యార్డ్ జీఎం (ప్రొడక్షన్)అశోక్‌కుమార్, సీనియర్ మేనేజర్ (హల్‌షాప్)రఘును మంగళవారం హల్‌షాప్ డిపార్టుమెంట్ కార్మికులు, ఆఫీస్ బేరర్లు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధికారులను కలిసిన వారిలో యూనియన్ ఆఫీస్ బేరర్లు లక్ష్మణరావు,శ్రీను,వల్లితో పాటు కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

విశాఖ విద్య: క్రీడలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని రామకృష్ణ పాఠశాల అధినేత కృష్ణా రెడ్డి అన్నారు. ఎన్ఏడీ కొత్తరోడ్డులోని పాఠశాలలో మంగళవారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీంద్రుడు, వైస్ ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం చేశారు.

బీచ్ సందర్శకులను ఇబ్బంది పెడితే చర్యలు

బీచ్ రోడ్డు: బీచ్‌కు వచ్చే సందర్శకులను ఇబ్బంది పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మూడో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ రామారావు హెచ్చరించారు. మంగళవారం బీచ్‌లో ఉన్న ఫొటోగ్రాఫర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కొంత మంది ఫొటోగ్రాఫర్లు సందర్శకుల అనుమతి లేకుండా ఫొటోలు తీసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, మరికొంత మంది స్నానాల ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

అభివృద్ధి పథం.. సంక్షేమ రథం

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ పాలన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మునుపెన్నడూ చూడని రీతిలో తమ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని.. దీనికి సీఎం జగన్ తీసుకుంటున్న చర్యలే కారణమని హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్య, వైద్యం, రహదారులు, కాల్వల నిర్మాణం, మంచినీటి వసతి.. ఒకటేమిటి.. పేద, మధ్య తరగతి ప్రజలు ఏం కోరుకుంటారో అవన్నీ అడగకుండానే అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్నారు.

- 481 సచివాలయం పరిధిలో ప్రగతి పరవళ్లు
- రూ. 20.06 కోట్ల లబ్ధి
- రహదారులు, కాల్వల ఆధునికీకరణ
- ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాలుకు మరమ్మతులు

గోపాలపట్నం: ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేస్తోంది. విశాఖ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తోంది. జీవీఎంసీ 91వ వార్డులో ఏకంగా రూ.2.53 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. గాంధీజీ కలలు సాకారమవుతున్నాయి. ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయి. అభివృద్ధి, సంక్షేమం వెల్లివిరుస్తోంది. ఇందుకు సచివాలయాలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. జీవీఎంసీ 91వ వార్డు ఓల్డు గోపాలపట్నం 481 సచివాలయం పరిధిలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోంది.

- ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం రూ 20,05,92,757 మేర సచివాలయం పరిధిలో ప్రజలు లబ్ధి పొందారు. అంతే కాకుండా రహదారులు, కాల్వలు, సామాజిక భవనాలు, పాఠశాలలు అభివృద్ధి చెందాయి
- జీవీఎంసీ నిధులు రూ. 20 లక్షలతో రహదారులు, కాల్వలు అభివృద్ధి చేశారు.
- ఇక్కడి ఎస్సీ కాలనీలో సామాజిక భవనానికి మరమ్మతులు చేశారు.
- రూ. 19 లక్షలతో రహదారుల నిర్మాణం
- కాపు వీధిలో రూ. 21 లక్షలతో రహదారులు, కాల్వల అభివృద్ధి
- రూ.7 లక్షలతో కాల్వల అభివృద్ధి
- నాడు నేడు ద్వారా రూ. 22 లక్షలతో మండల పరిషత్ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ఆర్‌వో ప్లాంట్, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, బెంచీల ఏర్పాటు



నాడు-నేడులో ఆధునికీకరించిన ప్రాథమిక పాఠశాల



ఆధునికీకరించిన సామాజిక భవనం



ప్రభుత్వ పథకాల డిజిటల్ బోర్డు

ప్రభుత్వ పాలన బాగుంది..



మా గ్రామంలో కాల్వలు, రోడ్లు వేశారు. పాఠశాలను సైతం బాగు చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో మా గ్రామం బాగు పడింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా సచివాలయాలు వచ్చాయి. ఇంటింటికీ పింఛన్లు ఇస్తున్నారు. ఈ ప్రభుత్వ పాలన చాలా బాగుంది. – యశోద, పాత గోపాలపట్నం

జగనన్నకు ధన్యవాదాలు..



జగనన్న ప్రభుత్వంలో పలు సంక్షేమ పథకాలు అందుకుంటున్నాం. మా కుటుంబ అభివృద్ధికి ఎంతగానో ఇవి దోహదపడుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. అంతే కాకుండా మా వీధిలో రోడ్లు బాగు పడ్డాయి. జగనన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– డి. భారతి, పాతగోపాలపట్నం



పాతగోపాలపట్నంలో నూతనంగా వేసిన రహదారులు

ఇది కదా అభివృద్ధి

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు చేసిన ఖర్చు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం నగదు
జగనన్న అమ్మ ఒడి	354	1,55,20,477
జగనన్న విద్యా దీవెన	221	79,74,331
వైఎస్సార్ రైతు భరోసా	68	30,80,000
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	5	10,167
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	4	10,186
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	3	6,480
వైఎస్సార్ మత్స్యకార భరోసా	7	1,20,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	301	2,91,07,500
వైఎస్సార్ చేయూత	144	61,87,500
వైఎస్సార్ ఆసరా	505	1,01,64,834
వైఎస్సార్ సున్నా వడ్డీ	676	25,62,838
వైఎస్సార్ కాపు నేస్తం	43	18,45,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	5	1,05,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	140	38,38,034
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	63	5,41,225
హౌసింగ్	213	95,73,678
వైఎస్సార్ బీమా	7	11,90,000
వైఎస్సార్ వాహన మిత్ర	68	20,80,000
జగనన్న చేదోడు	29	6,60,000
తెల్ల రేషన్ కార్డుదారులకు కోవిడ్ సహాయం	748	7,48,000
ప్రత్యక్ష ప్రయోజనం		9,82,82,305
పరోక్ష ప్రయోజనాలు		
ఇంటి స్థలాలు	310	7,62,60,000
జగనన్న విద్యా కానుక	183	12,99,666
8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు	26	3,43,772
జగనన్న తోడు	55	10,24,045
జగనన్న గోరుముద్ద	187	18,52,609
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	234	43,82,820
ఇంటింటికీ రేషన్	785	1,71,47,540



హోరాహోరీగా క్రికెట్ పోటీలు



వంశీకృష్ణకు మ్యాన్ ఆఫ్ దా మ్యాచ్ అందిస్తున్న ప్రసాదరెడ్డి, వెంకట కృష్ణమూర్తి యాదవ్

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈడీసీ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. సీఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ పోటీలు జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం 3 మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి మ్యాచ్ ఎన్ఏడీ ఎలెవెన్స్ వర్సెస్ ఆర్‌టీఎస్ జట్ల మధ్య జరిగింది. ఎన్ఏడీ ఎలెవెన్స్ జట్టు టాస్ గెలిచి నిర్ణీత 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. తర్వాత ఛేజింగ్‌కు దిగిన ఆర్‌టీఎస్ జట్టు 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 110 పరుగులు మాత్రమే చేసి ఓటమి మూటగట్టుకుంది. ఎన్ఏడీ ఎలెవెన్స్ బ్యాటర్ వంశీకృష్ణ 28 బందుల్లో 70 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ దా మ్యాచ్ సాధించాడు. అతనికి 90వ వార్డు నాయకులు చుక్క ప్రసాదరెడ్డి, నమ్మి వెంకట కృష్ణమూర్తి యాదవ్ అవార్డు అందించారు. రెండో మ్యాచ్ ఓల్డు గోపాలపట్నం వర్సెస్ మిస్టిక్ రేంజర్స్ మధ్య హోరీహోరీగా జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఓల్డు గోపాలపట్నం జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేసింది. ఛేజింగ్‌కి దిగిన మిస్టిక్ రేంజర్స్ 8.1 ఓవర్లలో 16 పరుగులు మాత్రమే చేసి చిత్తుగా ఓడిపోయింది. 3 ఓవర్లలో 6 పరుగులు ఇచ్చి 5 వికెట్లు సాధించిన చిన్నా రహానే మ్యాన్ ఆఫ్ దా మ్యాచ్ అందుకున్నాడు. మూడో మ్యాచ్ గోపాలపట్నం హైస్కూల్, క్రేజీబాయ్స్ మధ్య జరిగింది. టాస్ గెలిచిన గోపాలపట్నం హైస్కూల్ జట్టు 12 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. క్రేజీబాయ్స్ 11.1 ఓవర్లలో 92 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. గోపాలపట్నం హైస్కూల్ జట్టు బ్యాటర్ తేజ 43 బంతుల్లో 71 పరుగులు (6 సిక్స్‌లు, 9 ఫోర్లు) చేసి మ్యాన్ ఆఫ్ దా మ్యాచ్‌గా నిలిచాడు.

మహిళలకు ముగ్గుల పోటీలు

ఉత్సాహంగా పాల్గొనాలని బెహరా పిలుపు



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ముగ్గుల పోటీల్లో మహిళలంతా ఉత్సాహంగా పాల్గొనాలని ఆ పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో మంగళవారం 91, 92 వార్డుల కార్యకర్తలు, మహిళా నాయకులతో సమావేశం నిర్వహించారు. మూడు కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారందరికీ బహుమతి ఉంటుందన్నారు. ఈ నెల 8 నుంచి పోటీలు జరుగుతాయని తెలిపారు. వయో పరిమితిని బట్టి మూడు విభాగాలుగా ఉన్నాయన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 20వ రోజు మంగళవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

అష్టదళ పద్మారాధన..

108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాదస్వర కచేరీ..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నాదస్వర కచేరీ నిర్వహించారు. కళాకారులు పలు కీర్తనలు ఆలపించారు.

6న రథయాత్ర

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసంలో ప్రతి ఏటా నిర్వహించే కనకమహాలక్ష్మి అమ్మవారి రథోత్సవ కార్యక్రమం ఈ నెల 6న అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్ మీదుగా ఆలయం వరకు రథోత్సవం సాగనుంది.

చెత్తతొలగింపు అడ్డగింత

గోపాలపట్నం: సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు అధికారులు రహదారులపై ఉన్న చెత్తను ఎత్తేందుకు యత్నిస్తుండగా అడ్డగించారు. చెత్తలు తరలించే ప్రక్రియను జోన్-8 కమిషనర్ మల్లయ్య నాయుడు పర్యవేక్షించారు. ఆందోళన చేస్తున్న వారికి తొలుత గోపాలపట్నం వద్ద ఎస్ఐ అప్పల నాయుడు చెత్త తొలగింపును అడ్డుకోవద్దని కోరారు. అయినా కొందరు సీఐటీయూ నాయకులు, కార్మికులు కొత్తపాలెంలో చెత్త తరలించేందుకు యత్నిస్తుండగా అడ్డుకున్నారు. పోలీసులు ఎంత చెప్పినా పట్టించుకోలేదు. గోపాలపట్నం సీఐ సంతోష్ కుమార్ వీరిని ఒప్పించేందుకు ప్రయత్నించినా వినక పోవడంతో ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన పరిధిలో పలు చోట్ల ఆందోళన చేసిన వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషనకు తరలించి సాయంత్రం విడిచి పెట్టారు.

శుభ్రపడిన రోడ్లు

ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత జీవీఎంసీ అధికారులు కొత్తపాలెం ప్రధాన రహదారిలో చెత్త తొలగించి శుభ్రం చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. పనులను జెడ్సీ మల్లయ్యనాయుడు పర్యవేక్షించారు.

సామాజిక బాధ్యత

- చెత్త తొలగించేందుకు తరలివచ్చిన ప్రజానీకం
- చీపురు పట్టి రోడ్లు ఊడ్చిన డిప్యూటీ మేయర్ శ్రీధర్



చెత్త తొలగింపులో పాల్గొన్న వారికి సూచనలిస్తున్న శ్రీధర్



చీపురుపట్టి రోడ్లు ఊడుస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పరిసరాలను మనమే పరిశుభ్రం చేసుకోవాలనే డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపుతో ప్రజానీకం స్వచ్ఛందంగా తరలివచ్చారు. 52వ వార్డులో పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను మంగళవారం కాలనీ వాసులంతా శ్రమదానం చేసి తొలగించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు. సంజీవయ్య నగర్ నుంచి శాంతినగర్ వరకు రహదారులు శుభ్రం చేశారు.అనంతరం శాంతినగర్ పెంత్ కోస్ట్ చర్చి , కరాస గాయత్రీ అపార్ట మెంట్ వద్ద, తారకరామ అపార్ట్ మెంట్ , మర్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతాల్లోని అంతర్గత రహదారులు, ఇళ్ల ముందు ఉన్న చెత్తను శుభ్రం చేసి జేసీబీల సాయంతో లారీల్లో నింపి చెత్తను తీయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతీ ఒక్కరూ శ్రమదానంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జియ్యాని మారుతీ , జియ్యాని విజయ్ కుమార్, వెదుళ్ల శ్రీను, సీవో సుధారాణి, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మన కోసం.. మనతో..

- ఏయూ వేదికగా విస్తృతంగా స్టూడెంట్స్ క్లబ్స్ సేవలు
- సాంకేతికత నుంచి సాంస్కృతికం వరకు నిర్వహణ
- మార్గదర్శకత్వం అందించి నడిపిస్తున్న ఆ-హబ్

ఏయూ క్యాంపస్: నేటి తరం విద్యార్థులు తరగతి గదికి, పుస్తకాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. వారి చుట్టూ ఉన్న సమాజాన్ని ఆకళింపు చేసుకుంటున్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము మలుచుకుంటున్నారు. ఈ ప్రక్రియలో అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి కళాశాలలో స్టూడెంట్ క్లబ్స్ ఏర్పడుతున్నాయి. ఒక్కో ప్రత్యేక అంశాన్ని ఎంపిక చేసుకుని వారు తమ సహచర విద్యార్థులను నిష్ణాతులుగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థులంతా తమ కోసం.. తామే అన్నీ అయి వీటిని నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రం ఆ-హబ్ వీరికి అవసరమైన మార్గదర్శకం అందిస్తూ ముందుకు నడిపించడం మరో విశేషం . గత నాలుగు సంవత్సరాల కాలంలో ఏయూలో 8 విద్యార్థి క్లబ్‌లు ఏర్పాటు అయ్యాయి. ఇవి ఎంతో ప్రభావంతంగా పనిచేస్తున్నాయి. వీటిపై ఓ లుక్కేద్దాం..

మ్యాథ్స్ క్లబ్.. పయనీర్స్ క్లబ్..

ఇంజినీరింగ్ విద్యార్థులకు మ్యాథ్స్ ఒక బ్రహ్మ పదార్థంగా ఉండటం సహజం. అదే విధంగా కోడింగ్ ఎంతో అవసరం. కోడింగ్‌లో ప్రతిభ చూపాలంటే మ్యాథ్‌మెటిక్స్ స్కిల్స్ ఎంతో అవసరం. విద్యార్థుల్లో గణితం పట్ల భయాన్ని తొలగించడం, గణితాన్ని ఒక ఆటగా మార్చడం లక్ష్యంగా ఈ క్లబ్ పనిచేస్తోంది. దీనిలో 400 మందికి పైగా సభ్యులు ఉన్నారు. ట్రెజర్ హంట్, వర్క్‌షాప్‌లు వంటివి నిర్వహించారు. త్వరలో అంతర్జాతీయ గణిత సదస్సును నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు.

ఏయూ యునైటెడ్

విద్యార్థులందరినీ ఐక్యం చేసే విధంగా ఏయూ యునైటెడ్ పనిచేస్తోంది. కాలేజ్ కల్చరల్ ఫెస్ట్‌లు, టెక్నికల్ ఫెస్ట్‌ల నిర్వహణ బాధ్యత ఈ సభ్యులు చేపడతారు. ఆర్ట్స్, క్రాఫ్ట్స్, గేమ్స్, క్రీడలు, ఫొటోగ్రఫీ వంటివి మిళితం చేస్తూ వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, మ్యూజిక్, డ్యాన్స్ ఈవెంట్‌లు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు.

ఆటలతో ఆంగ్ల భాషపై ప్రావీణ్యం

ఇన్ఫోటైనమెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా ప్రతి రెండు వారాలకు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంగ్లిష్ లిటరేచర్, స్టోరీస్ వంటి కార్యక్రమాలు ఈ క్లబ్‌లో ప్రదర్శిస్తున్నారు. ప్రత్యేక అంశాలపై డిబేట్‌లు, ట్రెజర్ హంట్, పజిల్స్ సాల్వ్ చేయడంతో పాటు ఆటలతో ఆంగ్ల భాష ప్రావీణ్యం పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

కోడియం... కోడ్ ఐ యామ్....

ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఈ క్లబ్‌లో 850 మంది సభ్యులుగా చేరారు. విద్యార్థుల్లో కోడింగ్ పట్ల ఆసక్తి, సామర్థ్యాలను పెంచడం లక్ష్యంగా కోడియం పని చేస్తోంది. క్యాంపస్‌లో, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే హ్యాక్‌థాన్‌లో ఏయూ విద్యార్థులను ప్రోత్సహించడం, మార్గదర్శకం అందించడం లక్ష్యంగా కృషి చేస్తోంది. సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ, డ్రోన్ టెక్నాలజీ, వెబ్, యాప్ డెవలప్‌మెంట్, ఏఆర్, వీఆర్ వంటి అంశాలలో పని చేస్తున్నారు. ప్రతి వారం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కోడింగ్‌పై సదస్సులను నిర్వహిస్తున్నారు. నిపుణుల జ్ఞానాన్ని పంచుకోవడం, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఈ-4 క్లబ్...

ఎంగేజ్, ఎంతూస్, ఎమర్జ్, ఎవాల్వ్ అనే నినాదంతో విద్యార్థులను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దిశగా నడిపించడానికి ఈ-4 క్లబ్ పనిచేస్తోంది. ఈ క్లబ్‌లో 360 మంది సభ్యులు ఉన్నారు. ఆలోచనల నుంచి వ్యాపార సంస్థల దిశగా నడిపించడానికి వీరంతా పని చేస్తున్నారు. డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్, ఐడియాథాన్‌లు ప్రతి నెలా నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా మూడు కార్యక్రమాల నిర్వహణ లక్ష్యంగా క్లబ్ పనిచేస్తోంది.

జీడీఎస్

గూగుల్ సాంకేతికతలను విద్యార్థులకు పరిచయం చేయడం లక్ష్యంగా 400 మందికి పైగా సభ్యులు పని చేస్తున్నారు. వర్క్‌షాప్‌లు, వెబ్ డెవలప్‌మెంట్, ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీతో పాటు అధునాతన ఫ్లటర్ టెక్నాలజీలను సైతం విద్యార్థులకు పరిచయం చేసే దిశగా కృషి చేస్తున్నారు.

హల్ట్ ప్రైజ్ బృందం

సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహాయంతో ప్రపంచ వ్యాప్తంగా ఎదురయ్యే ముఖ్యమైన సవాళ్లకు పరిష్కారం చూపే యువతను ప్రోత్సహించే విధంగా హల్ట్ ప్రైజ్ నిలుస్తుంది. దీనికి అవసరమైన మార్గదర్శకం అందించే విధంగా విద్యార్థుల బృందం పని చేస్తోంది.

బిజ్ హబ్..

ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో చదువుతున్న విద్యార్థులు బిజ్ హబ్ క్లబ్‌ని స్థాపించారు. దీనిలో 300 మందికి పైగా విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు. విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, స్టార్టప్‌ల సంఖ్య పెంచడం లక్ష్యంగా పనిచేస్తోంది. ఇప్పటికే విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించి తమదైన ముద్ర వేసుకున్నారు.